క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంఎస్ఎన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు డిగ్రీలో కెమిస్ట్రీ చదివిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాలో 45 మంది యువకులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బ్రహ్మానంద రెడ్డి, మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శంకరయ్య, అరుణ్ తదితరులున్నారు.

బోరు మోటార్లు ప్రారంభం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి, పాతరాజంపేట గ్రామాల్లో నీటి సమస్య ఉందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ దృష్టికి మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ తీసుకువెళ్లగా వెంటనే స్పందించి రెండు బోరు మోటార్లను మంజూరు చేశారు. వీటిని రవికుమార్ బుధవారం ప్రారంభించారు. సరంపల్లి గ్రామంలోని ఊర దమ్మ గల్లీలో, ఒక బోరు మోటార్, పాతరాజంపేట ఎస్సీ కాలనీలో బోరు మోటార్‌ను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

హనుమాన్ దీక్ష స్వాముల కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ : హనుమాన్ దీక్ష స్వాముల మహా మండల పూజ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం బాన్సువాడలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ 16వ సామూహిక మహా మండల పూజ వచ్చే నెల 1న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వాములు అంబిల్‌పూరి రాజు, పాలకుర్తి దత్తు, గాండ్ల మహేష్, శంకర్, రమణ, ఉమేష్, సాయిబాబా, నరేష్ తదితరులున్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవు



మద్నూర్(జుక్కల్): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని ఉపాధి హామీ ఏపీడీ వామన్‌రావ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2023–2024 సంవత్సరంలో రూ.2.75 కోట్ల ఉపాధి హామీ పనులు జరిగాయని ఆడిట్ సిబ్బంది ప్రజావేదికలో చెప్పారు. ఆడిట్ అధికారులు రాఘవన్, ప్రశాంత్, మహేశ్వర్, ఎంపీడీవో రాణీ, ఎంపీవో వెంకటనర్సయ్య, ఏపీవో పద్మ ఉన్నారు.

కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే పోచారం



బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్ సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్ గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం రాంపూర్ తండాలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అంబర్‌సింగ్ పార్థివదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ కన్నీటిపర్యాంతమయ్యారు.

రేపు కవి సమ్మేళనం

కామారెడ్డి అర్బన్ : సంస్కార భారతి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వశిష్ఠ డిగ్రీ కళాశాలలో 'శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు సంస్కార భారతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సమ్మిరెడ్డి, పి.సత్యప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల కవులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జీపీ భవనం నిర్మించేదెక్కడో..?

- జీబీపేటకు మంజూరైన నూతన జీపీ భవనం
- ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలు మంజూరు
- స్థలం కొరతతో ఇబ్బందిగా మారిన వైనం
- పాత గ్రామ పంచాయతీ భవనం స్థలం సరిపోదంటున్న గ్రామస్తులు



ప్రస్తుతం కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవనం

బీబీపేట: మండల కేంద్రానికి నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరైంది. ఇందు కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలు విడుదల అయ్యాయి. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో అప్పటికే ఉన్నటువంటి మహిళా సమాఖ్య భవనం తొలగించారు. అదే స్థలంలో ముందు భాగం గ్రామ పంచాయతీ భవనం, వెనుక మహిళా సమాఖ్య భవనం వచ్చేలా నూతన భవనాన్ని నిర్మించారు.

ఈ నూతన భవనాన్ని 2017లో రూ.19 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. అదే సమయంలో దోమకొండ మండలం నుంచి బీబీపేట నూతన మండలంగా ఏర్పడింది. భవనం ఇరుకుగా మారడంతో స్థానిక నేతలు నూతన భవనం కోసం ప్రతిపాదనలు పంపారు. దీంతో రూ. 20 లక్షలు కేటాయించారు.

పశువైద్యశాలకు భవనం కరువు

పాత గ్రామ పంచాయతీ భవనంలో పశువైద్యశాల కొనసాగుతుంది. అందులో సరైన సౌకర్యాలు లేకపోవడంతో అధికారులు బదిలీపై మరో మండలానికి వెళ్లారు. ప్రస్తుతం వారంతపు సంత వద్ద పశువైద్యశాలకు స్థలం కేటాయించిన నూతన భవనం కోసం ఎదురు చూస్తున్నారు.



గతంలో కొనసాగిన గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థలో..

బీబీపేటలో స్థలం కొరత

నూతనంగా మండలం ఏర్పడడంతో రవాణా సౌకర్యం పెరిగింది. 2017 కంటే ముందు ఉన్నపాత భవనం శిథిలావస్థలో ఉండడం వల్ల అందులో ఏ శాఖ ఉండడానికి ముందుకు రాలేదు. దీంతో ఆ భవనాన్ని పశువైద్య శాలకు అప్పగించారు. వారు కూడా ఇబ్బందుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ జీపీ కార్యాలయం నిర్మించాలని కొంత మంది, మహిళా సమాఖ్య భవనం పైఅంతస్తులో నిర్మించాలని మరికొంత మంది పట్టుబడుతున్నారు. దూరం అయినా సరే గ్రామ పంచాయతీ భవనం విశాలంగా, అన్ని గదులు వచ్చేలా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్నాం

నూతన గ్రామ పంచాయతీ భవనానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20లక్షలు విడుదల అయ్యాయి. ఆ నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మించేందుకు అధికారులు, ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్నాం. వారు ఎక్కడ నిర్మించాలని తీర్మానం చేసినా అక్కడి నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– రమేష్, పంచాయతీ కార్యదర్శి, బీబీపేట

గాంధారి తైబజార్ @ రూ.7.64 లక్షలు



గాంధారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలం వేస్తున్న అధికారులు



లింగంపేట గ్రామ పంచాయతీ తైబజార్ వేలం వేస్తున్న కార్యదర్శి శ్రావణ్‌కుమార్

గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక జీపీ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేకాధికారి రేణుక అధ్యక్షతన తైబజార్, పశువుల దాఖలా చిట్టీ వేలంపాట నిర్వహించారు. తైబజార్‌ను రూ. 7.64 లక్షలకు గడ రాజేష్ కుమార్, దాఖలా చిట్టీ రూ. 3.5 లక్షలకు వాడి శ్రీధర్‌లు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

లింగంపేటలో రూ. 6.75 లక్షలు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలం పాటను ఎంపీడీవో నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్లారెడ్డికి చెందిన ముజీబ్ అనే వ్యక్తి రూ. 6.75 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. గ్రామ పెద్దలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం

మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తా తైబజార్‌ను గురువారం వేలం వేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి రిజ్వానా బేగం తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఆసక్తిగల పాల్గొనాలని కోరారు.

ఎల్లారెడ్డిలో పశువుల సంతకు తైబజార్ వేలం

ఎల్లారెడ్డిరూరల్ : పట్టణంలోని పశువుల సంతకు బుధవారం తైబజార్ వేలం పాట నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. పశువుల సంతకు ఎల్లారెడ్డికి చెందిన ఆరీఫ్ అనే వ్యక్తి రూ.లక్షకు వేలంలో దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వాసంతి తదితరులున్నారు.

చెత్త తొలగించిన మున్సిపల్ సిబ్బంది



సాక్షి ఎఫెక్ట్...

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ప్రియాడీలక్స్ జంట థియేటర్ల వద్ద నాలుగు రోజులుగా రోడ్డుపై చెత్త ఎత్తడం లేదని 'సాక్షి'లో బుధవారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. మున్సిపల్ సిబ్బంది వెంటనే చెత్తను తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. అధికారులు స్పందించినందుకు స్థానికులు పలువురు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



కామారెడ్డి టౌన్ : ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను బుధవారం న్యూఢిల్లీలోని యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కలిశారు. జిల్లా పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు ఆయన తెలిపారు. రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలని ఆమే దిశా నిర్దేశం చేసినట్లు కైలాస్ శ్రీనివాస్ తెలిపారు.

దేశాన్ని శ్రేష్ఠ భారత్‌గా మార్చాలి



వివిధ రాష్ట్రాల ప్రజల వేషధారణలో ఉన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): దేశాన్ని శ్రేష్ఠ భారత్‌గా మార్చేందుకు బాధ్యతాయుతంగా ఉండాలని గోపాల్‌పేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ సూచించారు. బుధవారం వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలోని పాఠశాలలను హార్యానాలోని పాఠశాలలతో జత చేశారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలుఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

ఎంఈవో వెంకటేశం సేవలు మరువలేనివి



ఎల్లారెడ్డి: ఎంఈవో వెంకటేశం సేవలు మరువలేనివని డీఈవో రాజు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో ఎంఈవో వెంకటేశం పదవీ విరమణ కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఈవో దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, రాష్ట్ర, జిల్లా గెజిటెడ్ సంఘం అధ్యక్షులు గంగారెడ్డి, లింగం, ఎంఎన్‌వో రాజులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వెంకట్, అనిల్, తదితరులున్నారు.

తహసీల్దార్ ఆఫీస్ ముందు ఆందోళన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బాధితులు ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం ఆయా గ్రామాలకు నుంచి పలువురు తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. కార్యాలయం సిబ్బంది సర్వర్ డౌన్ ఉంది వేచి ఉండాలని సూచించారు. సాయంత్రం 4:30 గంటల వరకు వేచి ఉన్నా ఒక్కరు కూడా రాకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. పది మందికిపైగా రిజిస్ట్రేషన్లు ఉండగా కేవలం ఇద్దరివి మాత్రమే చేసి వెళ్లిపోయారు. మిగతా వారు తహసీల్దార్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన బాధితులు

ఛత్రపతి శివాజీ బాటలో నడవాలి



ఎంద్రియాల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బాణాల లక్ష్మారెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ బాటలో నడవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఎంద్రియాల్ గ్రామంలో బుధవారం ఆర్యక్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంబేడ్కర్, చాకలి ఐలమ్మ, వివేకానందస్వామి, ఛత్రపతిశివాజీ విగ్రహాల ఏర్పాటుకు తన వంతు కృషి చేశానన్నారు. అంతకు ముందు ఆర్యక్షత్రీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ జిల్లాలో 90 శాతం గ్రామాలలో శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే మిగితా 10శాతం గ్రామాలలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగారావు, రవిందర్‌రావు, కిషన్‌రావు, మనోహర్‌రావు, బీజేపీ నాయకులు నీలం రాజులు, బాపురెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రావు, గ్రామపెద్దలు సాయిరెడ్డి , విఠల్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బిచ్కుందలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు



గుర్జకుంటలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

బిచ్కుంద/నిజాంసాగర్/రాజంపేట/భిక్కనూరు : నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామ పంచాయతీలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ ప్రారంభించారు.బిచ్కుంద మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు.ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ. 15 లక్షలతో గ్రామములో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. భిక్కనూరు మండలం గుర్జకుంట గ్రామంలో రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ప్రారంభించారు. బుధవారం నిజాంసాగర్ మండలం బంజపల్లి, అచ్చంపేట గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్ పరిశీలించారు. నిబంధనల ప్రకారం సిమెంట్, కంకర, ఇసుక వేస్తూ కాంక్రీట్ చేయాలన్నారు. రోడ్లు వేసిన తర్వాత వాటర్ క్యూరింగ్ తప్పని సరిగా చేయాలని సూచించారు.

ఎడ్లబండ్ల ప్రదర్శన



అయ్యపల్లి ఆలయం వద్ద ఎడ్లబండ్లు ప్రదర్శిస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి గ్రామ శివారులోని ప్రభుస్వామి ఆలయం చుట్టూ బుధవారం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి పలువురు ఎడ్లబండ్లను అలంకరించి ఆలయం చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల ప్రదర్శనకు రోడ్డు ఏర్పాటు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉగాది జాతర ఉత్సవాలలో భాగంగా మండలం గోపాల్‌పేటలో నిర్వహించనున్న శ్రీ నల్లపోచమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా చేపట్టనున్న ఎడ్లబండ్ల ప్రదర్శన కోసం బస్టాండ్ ఆవరణలో బుధవారం తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయకమిటీ సభ్యులతోపాటు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



సంతాయిపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈవో చందర్ నాయక్

తాడ్వాయి/రాజంపేట: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈవో చందర్ నాయక్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని సంతాయిపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు.రాజంపేటలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను జెడ్పీ సీఈవో చందర్ నాయక్ బుధవారం పరిశీలించారు. పనులను వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రఘురాం ను ఆదేశించారు. అనంతరం మండల కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఎంపివో సవితారెడ్డి, ఏపీవో కృష్ణాగౌడ్, టెక్నికల్ అసిస్టెంటు మహిపాల్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాల స్వీకరణ



బాన్సువాడ : ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొత్త ఓటర్ల నమోదు, మృతి చెందిన ఓటర్ల పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు ఉంటే సరిచూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంగమేశ్వర్, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి రూరల్ : పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జొన్నల శ్రీనివాస్, అధ్యక్షుడిగా మంగళారపు సాయికుమార్, క్యాషియర్‌గా కండెల దేవరాజ్, కార్యదర్శిగా దుబ్బక మురళి, ఉపాధ్యక్షుడిగా జొన్నల వేణు, సంయుక్త కార్యదర్శిగా నవీన్ ఎన్నికయ్యారు.

సంక్షిప్తం

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

తాడ్వాయి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం కామారెడ్డి ఆర్డీవో వీణ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది కార్యాలయానికి సకాలంలో హాజరై ప్రజలకు ఇబ్బందులు కలుగకుండాచూడాలన్నారు.ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్‌గది, కంప్యూటర్ గది, రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ రహీమొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక

లింగంపేట : మండల కేంద్రానికి చెందిన సూర్ల విరాట్, శెట్పల్లి గ్రామానికి చెందిన అట్టెం మనోజ్ విద్యార్థులు జవహర్ నవోదయ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు తల్లిదండ్రులు తెలిపారు. జనవరి 18వ తేదీన నవోదయ ఎంట్రెన్స్ పరీక్ష రాయగా మంగళవారం సాయంత్రం విడుదల చేసిన ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

ఇంటిపన్ను వడ్డీలో 90 శాతం రాయితీ

ఎల్లారెడ్డిరూరల్ : ఇంటి పన్నులకు సంబంధించిన వడ్డీలో 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా పన్ను చెల్లించి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డైరీని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు అల్లావుద్దీన్, కార్యదర్శి అనిల్, నాగరాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈవో రాజు తనిఖీ చేసినట్లు ఎంఈవో శ్రీహరి తెలిపారు. జడ్పీఉన్నత పాఠశాల గాంధారి, పోతంగల్ కలాన్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

పోడు భూముల రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

కామారెడ్డి టౌన్: పోడు భూముల రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అడిషనల్ కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్ మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి, నాయకులు తదితరులున్నారు.

ఆర్కే కళాశాలకు ఇన్నోవేషన్ హోస్ట్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలకు తెలంగాణ ఇన్నోవేషన్ హోస్ట్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపు దక్కింది. హైదరాబాద్‌లో టీహబ్‌లో జరిగిన కార్యక్రమంలో టీజీఐసీ సీఈవో మిరాజ్ చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి అందుకున్నారు.కళాశాల చైర్మన్ భాస్కర్‌రావు, డీన్ నవీన్, కో ఆర్డినేటర్ దత్తాద్రి, ప్రిన్సిపల్ గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో అనుమతులు లేకుండా నీట్, ఏపీసెట్, ఎంసెట్ కోచింగ్‌లు నిర్వహిస్తున్న సెంటర్లపై చర్యలు తీసుకోవాలని బీసీ, గిరిజన విద్యార్థి సంఘాల అధ్యక్షులు నాగరాజు, వినోద్‌నాయక్‌కు బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్‌సలాంకు వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూదన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899